క్లుప్తంగా

310 మంది వలంటీర్ల రాజీనామా

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 310 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని మూలపేటలో ఒకరు, వాకతిప్పలో ఐదుగురు, ఇసుకపల్లిలో ఇద్దరు, కొమరగిరి ఒక్కరు వెరసి మొత్తం తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక చేపల వీధిలో వైద్య బృందం ఎస్ఈఓ జీవన్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దావీదురాజు మాట్లాడుతూ ఇళ్లలో ఫ్రిజ్, పూల కుండీల్లో దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉందన్నారు. దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సారా దాడుల్లో ఆరుగురి అరెస్టు

- 40 లీటర్ల సారా స్వాధీనం
- 3600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



సారా టిన్నులను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది

పెద్దాపురం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి సారా విక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏవీవీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కట్టమూరు శివారులో దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా సుమారు 3600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఒక మోటారు సైకిల్, హెచ్‌పీ మోటారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రూ.90 వేలు స్వాధీనం

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక మఠంసెంటర్‌లో మోటారు సైకిల్‌పై వెళుతున్న మండిపూడి జగదీష్‌ను ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.90వేలు నగదు లభించింది. ఎటువంటి రసీదులు, రికార్డు లేక పోవడంతో అధికారి వై.శివరామకృష్ణయ్య నగదు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో నగదును లెక్కించి ఆర్వోకు అప్పగించారు.

ఓపెన్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు



సాయిరామకృష్ణ

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయని హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. గురువారం ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ఫలితాలు వెలువడ్డాయి. సాయి రామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతిలో 60 మంది పరీక్ష రాయగా 59 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంటర్‌లో 37 మందికి 32 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ విజయంలో ఫ్యాకల్టీలు కె.శివప్రసాద్, తాళ్లూరి వైకుంఠం, అచ్చిరెడ్డి కృషి అభినందనీయమన్నారు.

హనుమ ప్రార్థనతో అభీష్ట సిద్ధి

బోట్‌క్లబ్: ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తే సకల అభీష్టాలు నెరవేరుతాయని రాజమండ్రి ఉత్తరాధి మఠాధికారి, సుధా పండితులు విజయ సింహాచార్ అన్నారు. స్థానిక రామారావుపేట మధ్వసభలో హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించిన అధ్యాత్మిక ప్రవచనాలు గురువారంతో ముగిశాయి. శ్రీరామచంద్రుని పట్ల ఆంజనేయ స్వామి ఉన్న అపారభక్తిని ప్రస్తావిస్తూ ఏనాడు ఆయన స్మరణ లేనిదే ఉండే వారు కాదన్నారు. ఆయన మూడో అవతారమైన మధ్వా చార్యుల విశేషాలను కూడా వివరిస్తూ జ్ఞాన, భక్తి, వైరాగ్యాలలో వీరికి మించిన వారు లేరన్నారు. అనంతరం విజయ సింహాచార్‌ను ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ శివారున గురువారం జరిగిన ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... బెంగళూరు నుంచి కలకత్తాకు పార్సిల్ లోడ్‌తో వెళుతున్న లారీ ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో బీహర్ రాష్ట్రానికి చెందిన పార్సిల్ లోడ్ లారీ డ్రైవర్ గౌతమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన గౌతమ్ కుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలంగా దవులూరి నామినేషన్

- ఐదు కిలోమీటర్ల మేర జన సునామీ
- భార్య, కుమార్తెతో కలిసి భారీ ర్యాలీ



సామర్లకోట నుంచి జనవాహినితో దొరబాబు ర్యాలీ

సామర్లకోట: జన సునామి నడుమ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తెల్లవారు జామున స్థానిక బళ్లమార్కెట్‌లోని వినాయక ఆలయంలో, పంచారామ క్షేత్రం బాలాత్రిపురసుందరి ఆలయంలోను, స్టేషన్‌సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయం తదితర ఆలయాల్లో, పెద్దాపురంలోని చర్చిలలో పూజలు ప్రార్థనలు చేశారు. అలాగే స్థానిక ఆయన స్వగృహంలో దవులూరి కుటుంబ సభ్యులకు సర్వ మత ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భారీ ఎత్తున బాణా సంచాకాల్పులు, అభిమానుల కోలాహలంతో ర్యాలీ ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని జనం స్వచ్ఛందంగా హాజరుకావడంతో సుమారు ఐదు కిలోమీటర్ల పొడవునా ర్యాలీ సాగింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దొరబాబు నామినేషన్‌కు జనం హాజరు కావడంతో విజయం తథ్యమనే ధీమా వ్యక్తం అయింది. ఈ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. దొరబాబు ప్రచార రథానికి ముందు రెండు గుర్రాలతో యువత కేరింతలు కొడుతూ పాల్గొన్నారు. నల్గొండ జిల్లా సూర్యారావుపేట నుంచి వచ్చిన వైఎస్సార్ వీరాభిమాని ఎ శ్రీనివాసు వైఎస్సార్ వేషధారణలో ఆకర్షించారు.

భారీ ర్యాలీ సాగిందిలా..

స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి బడేలమ్మ చెరువు, నవదుర్గ ఆలయం, బ్రౌన్‌పేట, పెద్దాపురం సుధా ఆయిల్ ఫ్యాక్టరీ, మహారాణి కళాశాల మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీ సాగింది. కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ర్యాలీని నిలిపి అక్కడి నుంచి భార్య చంద్రకళ, కుమార్తె సార్విక ముఖ్య అనుచరులతో దవులూరి లోపలికి వెళ్లారు. మున్సిపల్ సెంటర్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ గజమాలతో దొరబాబు దంపతులను సత్కరించారు. ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గోరకపూడి చిన్నయ్యదొర, మాజీ ఎంపీపీ అత్తిలి సీతారామస్వామి, మాజీ ఎంపీపీటీసీ మలకల చంటిబాబు, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వీకే రాయపురం నుంచి భారీగా వచ్చిన శ్రేణులు

సామర్లకోట: దవులూరి దొరబాబు నామినేషన్‌కు మండల పరిధిలోని వీకే రాయపురం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివచ్చారు. గ్రామ పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు నాయకత్వంలో వారంతా సామర్లకోట వచ్చి అక్కడి నుంచి పెద్దాపురం నామినేషన్‌కు ర్యాలీలో పాల్గొన్నారు.



వీకే రాయపురం నుంచి దవులూరి నామినేషన్‌కు వచ్చిన జనం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో దొరబాబు పూజలు



సామర్లకోట దొరబాబు స్వగృహంలో సర్వమత ప్రార్థనల్లో ముస్లిం మత గురువు ఆశీస్సులు



నామినేషన్‌కు ముందు దీవెనలు అందజేస్తున్న పాస్టర్లు

20 ఏళ్ల కల నిజం చేసిన జగన్

సామర్లకోట: గత 20 ఏళ్లుగా పెద్దాపురం ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి నిరీక్షిస్తుండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నా కలను నిజం చేశారని దవులూరి దొరబాబు ఆనంద బాష్పాలతో తెలియజేశారు. పెద్దాపురంలో నామినేషన్ అనంతరం ఆయన స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానికుడిని కావడంతో తనపై ఉన్న ప్రేమతో వేలాదిగా తరలి వచ్చారన్నారు. ఈ ర్యాలీతో తన విజయానికి ఒక పునాది పడిందన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురు వేసి బయట నుంచి వచ్చిన వారిని వారి నియోజకవర్గానికి పంపుతామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలన తమ విజయానికి కీలకంగా మారుతుందన్నారు. స్థానికుడు ఎమ్మెల్యే అయితే ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చో చేసి చూపుతానని ఆయన వివరించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పర్యటిస్తానని చెప్పారు. రాజప్ప హోమ్ మంత్రిగా ఉప ముఖ్యమంత్రిగా పని చేస్తూ నియోజకవర్గంలో కొండల ద్వారా సొమ్ము చేసుకోవచ్చని కనిపెట్టిన శాస్త్రవేత్త అన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తానని చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో దొరబాబు సతీమణి చంద్రకళ, కుమార్తె సార్విక, భారత మాత సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోరకపూడి చిన్నయ్యదొర, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మలకల చంటిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



అమీనాబాదు ఉప్పుటేరులో నిలిపిన బోట్లపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: సమాజంలో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకరరావు సూచించారు. మండలంలోని అమీనాబాదు తీరప్రాంతం ఉప్పుటేరులో నిలిపిన బోట్లపై ప్లకార్డులతో గురువారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు అనురాధ, నూకరాజు, జి.గోపి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై అవగాహన

కొత్తపల్లి: వేసవిలో రైతులు పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ సూచించారు. స్థానిక పశువైద్య కేంద్రం వద్ద గురువారం పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ప్రధానంగా గేదెలు, సంకరజాతి పశువులు వేసవి తీవ్రతను తట్టుకోలేవన్నారు. దీంతో పాలఉత్పత్తి తగ్గడం, ఎదుగుదల రాకపోవడం, ఎదకు వచ్చిన లక్షణాలు కనిపించకపోవడం తదితర సమస్యలు ఏర్పడతాయన్నారు. సంకరజాతి విదేశీ ఆవులు ఎండ తీవ్రతకు గురైతే పాలదిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పశువుల మేతకు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత అనుకూల సమయమన్నారు. పశువులకు ఎల్లవేళలా చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఆఖరి రోజు నామినేషన్ల జోరు

- 12 నామినేషన్లు.. 27 సెట్లు దాఖలు
- భారీగా వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- ముగిసిన నామినేషన్ల ఘట్టం
- నేడు నామినేషన్ల పరిశీలన



భార్య, కుమార్తెతో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆఖరి రోజు గురువారం నామినేషన్లు జోరందుకున్నాయి. ప్రధాన అధికార పార్టీ వైఎస్సార్ సీపీతో పాటు మిగిలిన పార్టీలు రెండేసి సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగింపు రోజు నాటికి 12 మంది నామినేషన్లు 27 సెట్లు దాఖలు చేసినట్లు ఈఆర్వో జేఎస్ రామారావు తెలిపారు. పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు భారీ సంఖ్యలో కార్యకర్తలతో వచ్చి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి చంద్రకళ, తండ్రి సుబ్బారావు ఒక్కో నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి తుమ్మల దొరబాబు, బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ముగిసే సమయానికి 12 మంది అభ్యర్థులు నామినేషన్లకు గాను 27 సెట్లు దాఖలైనట్లు పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు తెలిపారు.

నేడు నామినేషన్ల పరిశీలన

నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఈ నెల 26వ తేదీన పరిశీలన ఉంటుందని ఆర్‌ఓ తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన నామినేషన్లను క్షుణంగా పరిశీలించి తుది నామినేషన్ల జాబితాను వెల్లడించనున్నట్లు రామారావు తెలిపారు.

సునీల్ నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు



కొత్తపల్లి మండలం నుంచి బైక్ ర్యాలీగా కాకినాడ బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ కాకినాడలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ ర్యాలీ, కార్యక్రమానికి కొత్తపల్లి మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో-ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకినాడ తరలివెళ్లారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తం

- ప్రశాంత వాతావరణం ఉండేలా చూడండి
- నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాజేష్ జోగ్‌పాల్



ఎన్నికల ప్రక్రియపై ఆరా తీస్తున్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు జోగ్‌పాల్

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై మరింత అప్రమత్తత అవసరమని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజేష్ జోగ్‌పాల్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆఖరి రోజు గురువారం నియోజకవర్గ నామినేషన్ కేంద్రంలో ప్రక్రియను ఆయన ఆర్‌ఓ జేఎస్ రామారావుతో కలిసి పరిశీలించారు. జోగ్‌పాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా అమలు చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కోడ్‌పై ప్రజలకు మరింత అవగాహన పెంచాలన్నారు. అనంతరం నామినేషన్ కేంద్రం వద్ద జరుగుతున్న వెబ్ కాస్టింగ్, నామినేషన్ల ప్రక్రియ, తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. తొలుత నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ తీరుపై ఆర్‌ఓ జేఎస్ రామారావును అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పరిశీలకులు రాజేష్ జోగ్‌పాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ లతాకుమారి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, డీటీ భానుకుమార్, పద్మజ తదితరులున్నారు.

ట్రాఫిక్ ఏఎస్సై రత్నంకు నగదు పురస్కారం



రత్నంకు నగదు పురస్కారం అందజేసిన సీఐ సురేష్

సామర్లకోట: స్థానిక ట్రాఫిక్ ఏఎస్సై రత్నంకు నగదు పురస్కారం లభించింది. విధి నిర్వహణలో ఆయన సేవలను గుర్తించి నగదు పురస్కారం అందజేశారు. ఈ మేరకు సీఐ సురేష్ గురువారం ఈ అవార్డును రత్నంకు అందజేశారు.

సంక్షేమ ప్రభుత్వానికే ప్రజల మద్దతు



పి.దొంతమూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పి.దొంతమూరులో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మళ్లీ రావాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. పిఠాపురం మండలం పి.దొంతమూరులో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చి, సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. ఇప్పటివరకూ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అడుగడుగునా ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికి అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే తమ పార్టీ ఓటు బ్యాంకు అన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే అందజేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించారన్నారు. ప్రతిపక్షాల కల్లబొల్లి కబుర్లు, హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆమె వెంట సర్పంచ్ కొత్తపల్లి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత కొత్తపల్లి రమణబాబ్జి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రతి ఒక్కరం ఓటేద్దాం..

- స్వీప్ లక్ష్యం సాధిద్దాం
- ఎంసీసీ ఆధ్వర్యంలో మానవహారం



జె.తిమ్మాపురంలో మానవహారంతో స్వీప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంసీసీ కన్వీనర్ ఉషారాణి

పెద్దాపురం: భారత ఎన్నికల సంఘం (స్వీప్) లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరం ఓటేద్దాం.. స్వీప్ లక్ష్యాన్ని సాధిద్దామని పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం ప్రజలతో కలిసి మండలంలోని జె.తిమ్మాపురంలో మానవహారం నిర్వహించారు. ఉషారాణి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా స్వీప్ పని చేస్తోందని, దీనికి ప్రతి ఓటరూ సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓ పీఆర్డీ నక్కా సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుభాని, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల పోరులో తొలిఘట్టం పూర్తి

- ముగిసిన నామినేషన్ల స్వీకరణ
- నేటి నుంచి నామినేషన్ల పరిశీలన



పిఠాపురంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న పార్టీ నాయకులు

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మొదటి ఘట్టం ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. శుక్రవారం నుంచి నామినేషన్ల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ నెల 26, 27, 28 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాకా ఎన్నికల బరిలో ఎవరు ఉన్నారనేది అధికారులు నిర్ణయిస్తారు. కాకినాడ జిల్లా జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి (ఆర్‌ఓ) రామ్‌సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అట్టహాసంగా నామినేషన్ల దాఖలు

ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఆయా పార్టీల అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వంగా గీత, జనసేన అభ్యర్థిగా పవన్ కల్యాణ్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి తదితరులు తమ అనుచరులతో భారీ ర్యాలీలుగా తరలివచ్చి నామినేషన్లను దాఖలు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో మొత్తం 23 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్ల్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ మొదటి మూడు రోజుల పాటు ఏ ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధికారులు ఖాళీగా ఉన్నారు. గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుండడంతో చివరి మూడు రోజులు నామినేషన్లు జోరందుకున్నాయి. నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసే సరికి వైఎస్సార్ సీపీ నుంచి వంగా గీత, వంగా కాశీ విశ్వనాథ్, జనసేన నుంచి పవన్ కల్యాణ్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నుంచి జగ్గారపు మల్లికార్జున, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మద్దూరి వీరబాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి మాదేపల్లి సత్యారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొండాడ జయరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా మొగలి లక్ష్మణమూర్తి, ఈటి జగదీష్, పైండా వీరప్రభాకరరావు, బోలిశెట్టి గౌరీమణి, ఆదిమూలం గంగాధర్, పెయ్యల దుర్గాప్రసాద్ తమ నామినేషన్లను దాఖలు చేశారు.

నామినేషన్ల పరిశీలన– ఈ నెల 26, 27, 28 తేదీలు
ఉపసంహరణ– 29
పోలింగ్– మే 13
కౌంటింగ్– జూన్ 4
మొత్తం దాఖలైన నామినేషన్లు – 35
నామినేషన్లు వేసిన అభ్యర్థులు – 23 మంది

ఓటు ప్రాముఖ్యతను గుర్తించండి

- ఓటర్లకు ఆర్వో వెంకటరావు పిలుపు
- రాజాట్యాంక్‌లో సెల్ఫీ పాయింట్



సెల్ఫీ పాయింట్ వద్ద ఆర్వో వెంకటరావు, అధికారులు

కాకినాడ: ప్రతి ఒక్కరూ ఓటు ప్రాధాన్యాన్ని గుర్తించాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. స్థానిక రాజాట్యాంక్ పార్కులో ఓటు విలువను తెలియజెప్పడం, ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించడం లక్ష్యంగా 'సెల్ఫీ పాయింట్' ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా ఇది ఏర్పాటైంది. ఈ సందర్భంగా అహ్లాదం కోసం, వాకింగ్ కోసం వచ్చిన ఓటర్లకు ఆర్వో వెంకటరావు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఓటు వేద్దామనే నినాదంతో ఏర్పాటైన ఈ సెల్ఫీపాయింట్ వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నదే ఎన్నికల కమిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధానంగా యువ ఓటర్లు చైతన్యవంతులై ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ సత్యకుమారి, పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.